క్లుప్తంగా

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి


కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్

దేవరకొండ: పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కంబాలపల్లి ఆనంద్ అన్నారు. బుధవారం దేవరకొండ మండల పరిధిలోని కట్టకొమ్ముతండాలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూలీలకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ విధానం సరైంది కాదన్నారు. ఏడాదికి 200రోజులు పని కల్పించడంతో పాటు రోజు కూలీ రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎఫ్ఏ శ్యామలయ్య, పాండు, దీప్లా, శంకర్ తదితరులున్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కొండమల్లేపల్లి: టీఎస్ సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో ఈ నెల 16న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న పెన్షన్ కాన్సిట్యూషనల్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో పెన్షన్ కాన్సిట్యూషనల్ మార్చ్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఉన్నత పాఠశాలల నుంచి సీపీఎస్ ఉద్యోగులందరూ పెన్షన్ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో చంద్రయ్య, రవికుమార్, చిన ముత్యాలు, సతీష్, లోక్యా తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం వార్షికోత్సవం

వేములపల్లి: రైతు సంఘం 88వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం వద్ద సంఘం మండల కార్యదర్శి పాల్వాయి రాంరెడ్డి రైతు సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు పాదూరి గోవర్ధని, రొండి శ్రీనివాస్, కోడిరెక్క వెంకన్న, పాదిల వెంకన్న, వీరయ్య, వెంకటేశ్వర్లు, జరీనా, లతీఫ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించిన అధికారులు


బీఎన్‌ఆర్ కాలనీలో చెత్త తొలగింపు పనులు చేయిస్తున్న కమిషనర్ వెంకటయ్య

సాక్షి ఎఫెక్ట్..

దేవరకొండ: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో 'అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం' అనే శీర్షికన ఈ నెల 11న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి స్పందించిన దేవరకొండ మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య చర్యలు చేపట్టారు. బుధవారం పట్టణంలోని బీఎన్‌ఆర్ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లలో తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు ఖాళీ స్థలాలు, మురుగు కాలువల్లో చెత్త పడవేయొద్దని సూచించారు. చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని కోరారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాఫర్, శరత్, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులున్నారు.

తిరునగరు గంగాధర్ జయంతి


తిరునగరు గంగాధర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మిర్యాలగూడ: స్వాతంత్ర్య సమరయోధుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరునగరు గంగాధర్ జయంతిని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ నాగలక్ష్మి, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉబ్బపల్లి సోములు, రాయపూడి భవాని, రాయపూడి ఉమాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మురుగు కాల్వలు

- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- ఫాగింగ్ చేయక దోమల విజృంభణ

మిర్యాలగూడ టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. కాలువల్లో చెత్తను తొలగించడంలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని సుందర్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో పాత ఆర్‌అండ్‌బీ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్ వెనక భాగంలోని ప్రధాన నాలాలో మట్టి దిబ్బలు పేరుకుపోవడంత పాటు పిచ్చి మొక్కలు ఏపుగా పెరడగంతో పాటు మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా డ్రెయినేజీ నీరు నాలా పైకి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. పట్టణ ప్రగతిలో భాగంగా మురికివాడలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా శానిటేషన్ చర్యలు చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం దోమల నివారణ చర్యలు కూడా చేపట్టడం లేదని, వారానికి ఒక్కసారి కూడా వార్డుల్లో ఫాగింగ్ చేయడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేస్తున్నప్పటికీ వాటిని సరిగ్గా ఉపయోగించడంలేదని తెలుస్తోంది.

ఖాళీ స్థలాల్లోనే మురుగు..

పట్టణంలో 48 వార్డులుండగా సుమారు సుమారు 32వేల గృహాలున్నాయి. ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం వేయడంతో పాటు ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటిని సైతం కొందరు ఆ ఖాళీ స్థలాల్లోనే వదులుతున్నారు. డ్రెయినేజీ నిర్వహణ సరిగా లేకపోవడంతో వాటిలో చెత్త పేరుకుపోయి ఖాళీ స్థలాల్లోకి మురుగునీరు వచ్చి చేరుతుంది. దీంతో దోమలు విపరీతంగా పెరగడంతో పాటు పందులు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, డ్రెయినేజీ వ్యవస్థపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని కాలనీల వాసులు వాపోతున్నారు.


హనుమాన్‌పేటలో మురుగు కాల్వలో పేరుకపోయిన ప్లాస్టిక్ కవర్లు


ఆర్డీఓ కార్యాలయం వెనుక భాగంలో నాలాలో పెరిగిన పిచ్చి మొక్కలు

ఎవరూ పట్టించుకోవడం లేదు



మా ఇంటి పక్కనే ఖాళీ స్థలం ఉంది. అందులోకి డ్రెయినేజీ నీరు వచ్చి చేరుతుంది. నెలల తరబడి సమస్య ఇదే విధంగా ఉంది. మురుగు కాలువలను శుభ్రం చేస్తే ఈ సమస్య ఉత్పన్నమయ్యేది కాదు. ఈ విషయంపై కిందిస్థాయి సిబ్బంది నుంచి కమిషనర్ స్థాయి వరకు తెలియజేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది.

– ముచ్చర్ల మల్లయ్య, హనుమాన్‌పేట, మిర్యాలగూడ

నోటీసులు జారీ చేశాం



ఖాళీ స్థలాలు పిచ్చిమొక్కలను తొలగించుకొని ప్లాట్లు శుభ్రంగా ఉంచుకోవాలని ఇప్పటికే యాజమానులకు నోటిసులు జారీ చేశాం. డ్రెయినేజీ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. ఏదైనా సమస్య ఉంటే మున్సిపల్ కార్యాలయంలో సమాచారం ఇస్తే యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడతాం.

– రవీందర్‌సాగర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

నిందితులను కఠినంగా శిక్షించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

త్రిపురారం: మండలంలోని జి.అన్నారం గ్రామానికి చెందిన ఇరిగి నవీన్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన అన్నారం గ్రామానికి చేరుకుని నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. ఎస్సీ వర్గానికి చెందిన నవీన్‌ను చంపడం దారుణమన్నారు. గ్రామంలోనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. నవీన్ కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, డబుల్ బెడ్‌రూం ఇల్లు, 3 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, పాలడుగు నాగార్జున, బొజ్జ చిన్న, పోతె రవి, సహాయ కార్యదర్శి దైద శ్రీను, కోడిరెక్క మల్లయ్య, కొడిరెక్క రాధిక, దైద జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

మిర్యాలగూడ: నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ కాలం పూర్తి చేసుకున్నందున ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయాలని పలువురు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరారు. బుధవారం దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ప్రొబేషనరీ పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కృష్ణమూర్తితో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం స్పందించి జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలని కోరారు.

భగీరథ నీటి సరఫరాపై నిలదీసిన సభ్యులు

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు తాగునీటి సమస్యపై మిషన్ భగీరథ ఏఈని నిలదీశారు. ఇరిగేషన్ శాఖ డీఈ శైలజ సమావేశానికి హాజరుకాకపోవడంపై ఎంపీడీఓ మండిపడ్డారు. మరోమారు ఇలాగే జరిగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు సంబంధించిన విషయాలపై చర్చ జరిగింది. అదేవిధంగా మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను పెంచాలని కోఆప్షన్ సభ్యుడు ఎంఏ సిరాజ్‌ఖాన్ సీడీపీఓ సరళను కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్


దేవరకొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ దళిత సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలో రూ.1.60కోట్లతో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలే దేశానికి శ్రేయస్కరమని భావించి తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నడిబొడ్డున 125అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించిందని గుర్తుచేశారు. సమావేశంలో ఆర్డీఓ గోపిరాం, ఏఎస్‌డబ్ల్యూఓ వెంకటకృష్ణ, బాబు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ జయంతి ఉత్సవాల రాష్ట్ర కోఆర్డినేటర్ మాస భాస్కర్, తహసీల్దార్ రాజు, దళిత సంఘాల నాయకులు తదితరులున్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చింతపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషిచేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మదర్సాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, నట్వ గిరిధర్, రాహత్‌అలీ, ఎల్లంకి అశోక్, వింజమూరి రవి, యాసిన్ బాబా, ఖాలెద్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

రాష్ట్రంలోని పేద ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుర్మేడు గ్రామంలో టీడీపీ, బీజేపీ నుంచి 150 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, ఉజ్జిని నరేందర్‌రావు, వింజమూరి రవి, కుంభం శ్వేతాశ్రీశైలం, నాదిరి రమేశ్, మాస భాస్కర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే కేసీఆర్ లక్ష్యం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: రైతును రాజు చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. కేశవాపురం-కొండ్రపోల్ లిఫ్టు ఇరిగేషన్ పథకంలో భాగంగా దామరచర్ల మండలంలోని మంగల్‌దుబ్బతండా శివారులో మూసీ వద్ద నూతన పైపులైన్ నిర్మాణ పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. కృష్ణపట్టి ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన కేశవాపురం- కొండ్రపోల్ లిఫ్టు పథకాన్ని త్వరలోనే పూర్తిచేస్తామని తెలిపారు. రైతు సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు కుందూరు వీరకోటిరెడ్డి, జెడ్పీటీసీ లలిత, ఎంపీపీ ధీరావత్ నందిని, యూసుఫ్, నాగుల్‌మీరా, ఎంఈవో బాలాజీనాయక్, సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

మిర్యాలగూడ: ఇటీవల నిర్వహించిన ఐఐటీ(వెలోసిటీ), నీట్ పరీక్షల్లో పట్టణానికి చెందిన భారత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు మునవర్ ఖాన్, మోహిద్దీన్, రేహాన్, షిరిన్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బుధవారం వారిని మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మొహమ్మద్‌ఖాన్, చాందిని, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్ తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ: పైపులైన్ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

సంక్షిప్త సమాచారం

కఠిన చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్: నకిలీ బిల్లులతో సీఎంఆర్ఎఫ్ నిధులు కాజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐఎంఏ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మాధవ కుమార్, కిశోర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా వారు మాట్లాడుతూ.. అర్హత లేకపోయినా ఆస్పత్రులు నిర్వహి స్తున్న వారిపై జిల్లా వైద్యాధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ నాయకులు డాక్టర్ పుల్లారావు, కృష్ణప్రసాద్, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

సకాలంలో గౌరవ వేతనం అందించాలి

మాడుగులపల్లి: సకాలంలో గౌరవ వేతనం అందేలా చూడాలని వీఓఏలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఆ సంఘం మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షురాలు కప్పల లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం వీఓఏలు సమావేశమయ్యారు. సెర్ప్ నుంచి వచ్చే రూ.3900 గౌరవ వేతనం కొన్ని నెలలుగా అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి రూ.26వేల వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షురాలు జల్ల పుష్ప, కార్యదర్శి చిట్యాల దానేలు, కోశాధికారి తండు సైదమ్మ, ఉపాధ్యక్షురాలు తుంగతుర్తి యాదమ్మ, సంయుక్త కార్యదర్శి చిలకమర్రి జ్యోతి పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి వైఎస్ జగన్

మిర్యాలగూడ టౌన్: ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్ బీసీల పక్షపాతి అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టాలని నిర్ణయించడం హర్షనీయమన్నారు. తెలంగాణలో కూడా బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బంటు వెంకటేశ్వర్లు, రాంబాబు యాదవ్ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కొర్రీలు పెట్టొద్దు

మిర్యాలగూడ: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు పెట్టకుండా బేషరతుగా కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మిర్యాలగూడ: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలో 150మంది కూలీలతో పని చేయించాలని, గ్రామాల్లో ఫిష్ పాండ్‌లను గుర్తించి అంచనాలను తయారు చేసి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఉపాధి హామీలో కొత్త పనులను గుర్తించి ప్రతి పనిని కొలతల ప్రకారం కూలీలతో చేయించి దినసరి వేతనం రూ.272 అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో శానిటేషన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. క్రీడా ప్రాంగణాలు లేని గ్రామాలను గుర్తించి మైదానాలను ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో ఎంపీఓ వీరారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


మిర్యాలగూడ: అవంతీపురం మార్కెట్ యార్డులో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు


హాలియా: అనుముల మండలం శ్రీనాథపురంలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భగత్


మాడుగులపల్లి: ధాన్యం కాంటా వేస్తున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

మిర్యాలగూడ: మండలంలోని అవంతీపురం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బంటు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు గడగోజు ఏడుకొండలు, మండల పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దామరచర్లలో..

దామరచర్ల మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో, మండలంలోని తెట్టెకుంట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు కుందూరు వీరకోటిరెడ్డి, జెడ్పీటీసీ లలితాహాతీరాం, ఎంపీపీ ధీరావత్ నందినీరవితేజ తదితరులు పాల్గొన్నారు.

హాలియాలో..

హాలియా: అనుముల మండలంలోని శ్రీనాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, నిడమనూరు ఎంపీపీ బొల్లం జయమ్మ, బీఆర్‌ఎస్ అనుముల మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మంగ, ఎంపీడీఓ లక్ష్మి, ఏఓ సంతోషి, ఏపీఎం కళావతి, సర్పంచులు , ఎంపీటీసీ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని అల్వాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నోముల భగత్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, అల్వాల సర్పంచ్ పెంకీసు పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరులో..

నిడమనూరు: మండలంలోని వెంకటాపురంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నోముల భగత్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, ఎంపీపీ బొల్లం జయమ్మ, మార్కెట్ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లిలో..

పెద్దఅడిశర్లపల్లి: మండలం కేంద్రంతో పాటు ఘనపురం, అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లిలో..

మాడుగులపల్లి: మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీవిద్యారాజు, వైస్ ఎంపీపీ సుమలతాశ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ తూనం శోభారవి, వేములపల్లి, తిప్పర్తి పీఏసీఎస్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పాములపహాడ్, పోరెడ్డిగూడెం, చిరుమర్తి, ఆగామోత్కూర్, గుర్రప్పగూడెం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ పోకల శ్రీవిద్యారాజు ప్రారంభించారు. జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, సర్పంచులు, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాబయ్య, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారంలో..

త్రిపురారం: మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ అనుముల పాండమ్మ ప్రారంభించారు. అదేవిధంగా మండల కేంద్రంలో, పెద్దదేవులపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయా పీఏసీఎస్‌ల చైర్మన్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో నిడమనూరు మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, జెడ్పీటీసీ ధనావత్ భారతీ, త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్, అనంతరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి: మండలంలోని గోన్యాతండా, మొల్కచర్ల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్, మండల ఇన్‌చార్జి తహసీల్దార్ రఘు, ఏఓ అర్చన, ఏపీఎం ఝాన్సీ, టీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనునాయక్, సర్పంచ్ సైదమ్మస్వామి తదితరులున్నారు.

వేములపల్లిలో..

వేములపల్లి: మండలంలోని సల్కునూరు గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ అంకెపాక రాజుతో కలిసి పీఏసీఎస్ చైర్మన్ గడ్డం స్పృధర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈఓ నరేష్, డైరెక్టర్లు ఆరాల లింగయ్య, హరికృష్ణ, జానకమ్మ, గడ్డం వెంకన్న, ఇరుగు వెంకటయ్య, రవీందర్‌రెడ్డి, సుధాకర్, జయసుధ, భిక్షం తదితరులు పాల్గొన్నారు.


త్రిపురారం మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పాండమ్మ


అడవిదేవులపల్లి: గోన్యాతండాలో ప్రారంభిస్తున్న ఎంపీపీ బాలాజీనాయక్ , జెడ్పీటీసీ సేవ్యానాయక్


వేములపల్లి: సల్కునూరులో ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ స్పృధర్‌రెడ్డి, సర్పంచ్ రాజు

'మినా'లో యోగా మహోత్సవ్

మిర్యాలగూడ: పట్టణంలోని మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, శ్రీరామచంద్ర మిషన్ అండ్ మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ ఆధ్వర్యంలో బుధవారం యోగా మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ గురునాథర్‌రెడ్డి, వీఎస్ఎన్.రెడ్డి, లింగయ్య పాల్గొని విద్యార్థినులకు ఆసనాలు, ధ్యానం, ప్రాణాయామంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విస్డమ్ బ్రిడ్జి అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ షహలలాబుతుల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బడేసాహెబ్, ట్రైనర్ కవిత, మౌనిక, రుద్ర, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


యోగా మహోత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు అభినందనీయం

హాలియా: రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నడిబొడ్డున అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దళిత సంఘం, బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ నూతన సచివాలయ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టి అన్నివర్గాల ప్రజల మన్ననలు పొందారన్నారు. ఈ నెల 14న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆడెపు రామలింగయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ కామర్ల జానయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు

మండలి చైర్మన్, ఎమ్మెల్యే నివాళి

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన పారాబాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్న మాతృమూర్తి సముద్రాల లక్ష్మమ్మ మృతిచెందింది. బుధవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌లు లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, పస్నూరి యుగేంధర్‌రెడ్డి, కేసాని లింగారెడ్డి, వడ్త్య దేవేందర్, రాంబాబునాయక్, గంధం సురేష్, మాడ్గుల యాదగిరి తదితరులున్నారు.


లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్